
# ఇదో అనుభవం

– కె. ఆశాలత



‘‘ఏమోయ్ బాబూరావ్! ఇలా ఓసారి రావోయ్!’’ ఆ ఇంటిముందు నడుస్తున్నవాడినల్లా ఆగి ఆ పిలుపు వినవచ్చినవైపు చూశాను.

ఆఇంటి వసారాలో వాలుకుర్చీలో ఓ యాభై అయిదేళ్ల ముసలాయన నావైపే చూస్తూ, రమ్మన్నట్లు చేత్తో సైగచేయడంతో ఓసారి నాచుట్టుపక్కల చూసుకున్నాను. నన్ను కాదేమోనని.

‘‘నిన్నేనోయ్!’’ అని ఆయన బుగ్గమీసాలు సవరించుకుంటూ ధృవపరచడంతో, అతనివైపు ఒకసారి పరిశీలనగా చూసి, గతంలో ఇతన్నెక్కడయినా చూశానా? అని గుర్తుతెచ్చుకుంటూ ఆఇంటివైపు నడిచాను.

అతన్నెక్కడా చూసినట్లు గుర్తురాలేదు. బహుశా నన్నే ఆయన ఎప్పుడైనా చూసి ఉండొచ్చు అనుకుంటూ అతన్ని చేరుకున్నాను. అతను కూర్చున్న వాలుకుర్చీ పక్కనే ఉన్న ఒక కుర్చీని చూపిస్తూ, చిన్నగానవ్వి ‘కూర్చోవోయ్!’ అన్నారు.

నాకు కూర్చోక తప్పలేదు.

‘‘ఎటుబయల్దేరావ్?’’ అడిగారాయన.

‘‘బీచ్‌కెళదామనీ..’’ చెప్పాను.

‘‘మంచిదే! బీచ్‌గాలి సాయంత్రాలు వంటికి ఆరోగ్యకరం! అవునూ నువ్విప్పుడు ఎం.ఎ. చదువుతున్నావుకదూ?’’

‘‘లేదండీ! బి.ఎ.తోనే ఆపేసి ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను’’ అంటూ పనిచేస్తున్న కంపెనీ పేరు చెప్పాను.

‘‘మంచిదే! మంచి పేరున్న కంపెనీ! ఆ కంపెనీలో ఉద్యోగం మంచిదే! అవునూ బి.ఏ.తోనే ఆపేశావేం?’’

‘‘ఇంటి ఆర్థిక పరిస్థితులు సరిగాలేక పైచదువులు చదవలేక ఉద్యోగంలో చేరిపోయాను.’’

‘‘మంచిదే! ఆర్థికంగా కష్టాలొచ్చినప్పుడు, ఆదుకోవాల్సింది మగపిల్లలే కదోయ్. అమ్మాయ్ స్రవంతీ! కాఫీ కలిపి పట్టుకురామ్మా!’’ అంటూ ఇంట్లోకి కేకవేశారు.

‘‘అబ్బేవద్దండి! నాకు టీ, కాఫీ తాగే అలవాటు లేదు’’ అన్నాను.

అతను వేసిన కేక ఇంట్లోవాళ్లకు వినిపించినట్లు లేదు. ఇంట్లోంచి ఎటువంటి రెస్పాన్స్ రాలేదు.

‘మంచిదే! కాఫీ ఆరోగ్యానికి అంత మంచిదికాదని ఈమధ్యన కొందరు సైంటిస్ట్‌లు కనుగొన్నారు కూడాను. ‘‘అవునూ! నీకిప్పుడు ఎందరు పిల్లలేమిటి?’’

‘‘అబ్బే! ఇంకా ఏంలేదండి!’’

‘‘మంచిదే ఇంత చిన్నవయస్సులోనే నాన్నవైపోవడమెందుకు? నాలుగైదు సంవత్సరాలు పోయిన తరువాతే కావాలనుకుంటున్నావా?’’

‘‘నాకింకా పెళ్లే కాలేదండి.’’

‘‘మంచిదే! అయినా ఏం ఇంకా పెళ్లి చేసుకోలేదు?’’

‘‘ఉద్యోగం పర్మనెంట్ కాలేదండి!’’

‘‘మంచిదే! ఉద్యోగం పర్మినంట్ అయిన తరువాత చేసుకుంటేనే మంచిది.’’

ఏమిటితను! ప్రతిదానికీ మంచిదే! మంచిదే! అంటూ పాట పాడుతున్నాడు. అసలు ఎవరీ అపరిచిత వ్యక్తి? ఏమిటీ ఆరాలు? అనుకుంటూ ‘‘నేవెళతానండీ! చిన్నపని వుంది’’ అంటూ లేచాను.

‘‘మంచిదే! కాఫీ అయినా పుచ్చుకోకుండా వెళిపోతున్నావ్, ‘‘అన్నట్టు మీ నాన్న సత్యనారాయణను నేనొకసారి రమ్మన్నానని చెప్పు.’’

నాకు తల తిరిగినంత పనయింది.

‘‘మాన్నగారి పేరు సత్యనారాయణ కాదండి, సూర్యనారాయణ’’ అన్నాను అతనివైపు ఆశ్చర్యంగా చూస్తూ.

‘‘నీవు సత్యనారాయణ కొడుకువు కాదన్నమాట. మంచిదే! ఓ కొత్తవ్యక్తివి పరిచయమయ్యావు, అప్పుడప్పుడూ వస్తూండు.’’

ఇంతలో–

‘‘నాన్నా’’ ఇంట్లోంచి ఓ కోమల కంఠం కొంచెం కఠినంగా వినిపించింది.

అంతే! యాభైఏళ్ళు పైబడ్డ ముసలాయన ఆరేళ్ల చిన్నపిల్లాడిలా అరచేతిని పెదవులపై పెట్టుకుని బుద్ధిగా, నిశ్చలంగా కూర్చుని రోడ్డువైపు చూపులు తిప్పుకున్నారు.

క్షణం తరువాత ఆ కోమల కంఠంగల కోమలి బయటకొచ్చింది.

కళ్లు జిగేల్‌మన్నాయి నాకు క్షణకాలం. పద్దెనిమిదేళ్ల పడుచుపిల్ల. విరబూసిన మల్లెతీగెలా, కారు చీకట్లో మెరుపు తీగెలా, తెల్లగా, సన్నగా, నాజూగ్గా చాలా అందంగా ఉంది.

ఆమె అందం నాహృదయాన్ని తీవ్ర స్పందనకు గురిచేసింది.

‘‘క్షమించండి. మానాన్నగార్కి ఈమధ్యనే కొంచెం మతి చలించింది... అప్పుడప్పుడూ ఇలా..’’ ఆపైన చెప్పలేక ఆగిపోయింది మెరుపుతీగె. కోమల కంఠంలో సన్నటి జీర...

నాకేం చెప్పాలో తోచలేదు. ఆమె అందాన్ని కళ్లలో నింపుకుని ‘‘ఫర్వాలేదండీ! వెళ్తాను’’ అంటూ రోడ్డువైపు నడిచాను. ఆ ముసలాయనకు నాపేరు ఎలా తెలిసిందా? అని తెగ ఆలోచించాను. చివరకు అది యాదృచ్ఛికంగానే జరిగిందన్న నిర్ణయానికొచ్చి ఆ అమ్మాయి అందం కళ్లలో కదుల్తుండగా ‘ఇదో అనుభవం’ అనుకున్నాను.

★